క్లుప్తంగా

26 నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు

గూడెంకొత్తవీధి: ఆరేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదుకోసం ఈనెల 26 నుంచి 28వరకూ నిర్వహించనున్న ప్రత్యేకశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎంపీడీవో ఉమామహేశ్వరరావు మంగళవారం తెలిపారు. గూడెంకొత్తవీధి-1, రింతాడ సచివాలయం-2లో ఈ కేంద్రాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఆరేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదు చేయించాలన్నారు. జనన ధ్రువీకరణపత్రాలు లేనివారికి అక్కడే వీటిని ఇస్తామన్నారు.

45 మందికి వైద్యసేవలు


రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

రాజవొమ్మంగి : మండలంలోని వెలగలపాలెం 1, 2 గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో 45 మందికి వైద్య సేవలందించినట్టు 104 అంబులెన్స్ డీఈవో శ్రీనివాస్ తెలిపారు. బీపీ సమస్య ఉన్న 25 మందికి, సుగర్‌తో బాధపడుతున్న మరో 8 మందికి పరీక్షలు చేసి, మందులు అందజేసినట్టు చెప్పారు. ఎంఎల్‌హెచ్‌పీ రమ్య, హెచ్వీ చిన్నయమ్మ, 104 పైలెట్ కనకరాజు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

26 నుంచి పీసా గ్రామ సభలు

గంగవరం : వివిధ గ్రామాల్లో వాయిదా పడిన పీసా గ్రామసభలను తిరిగి ఈ నెల 26 నుంచి 30 వరకు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. ఈ నెల 26న పండ్రపోలు, పిడతమామిడి, 27న మర్రిపాలెం, భయ్యనపల్లి, గంగవరం, కొత్తాడ, 28న జడేరు, ఎండపల్లి, మోహనాపురం, 30న మొల్లేరు గ్రామాల్లో పీసా గ్రామసభలు నిర్వహించి, ఉపాధ్యక్ష, కార్యదర్శుల ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

పరీక్ష అట్టలు, జామెట్రీ బాక్సుల పంపిణీ

కూనవరం: స్థానిక విజయసాధన హైస్కూల్‌లో విద్యార్థులకు తన తండ్రి నర్సింహమూర్తి జ్ఞాపకార్థం ఎం.ఝాన్సీబాయి మంగళవారం పరీక్ష అట్టలు జామెట్రీ బాక్సులను పంపిణీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ దనిసిరి రజిని, ఉపాధ్యాయులు నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దోమతెరల పంపిణీ


దోమ తెరలు అందచేస్తున్న అలెర్ట్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు

చింతూరు: విజయవాడకు చెందిన అలెర్ట్ స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో మంగళవారం చింతూరు, వీఆర్‌పురం మండలాల్లోని కొండరెడ్లు, గిరిజనులకు దోమతెరలను పంపిణీ చేశారు. చింతూరు మండలంలో కొండపల్లి, చినసీతనపల్లి, రామన్నపాలెం, తులసిపాక, వీఆర్‌పురం మండలంలో చొప్పల్లి, రామవరంలో 510 కుటుంబాలకు మూడువేల దోమతెరలు పంపిణీ చేశారు. దోమల వల్ల మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలుతాయని, అవి కుట్టకుండా దోమతెరలను వినియోగించాలని సంస్థ నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కో ఆర్డినేటర్ సత్యనారాయణ, కల్యాణ్, రంగమ్మ, సాయికృష్ణ, నాయకులు చిన్నారెడ్డి, రాజు, రవి, సతీష్ పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

గూడెంకొత్తవీధి: మండలంలోని రింతాడ గ్రామస్తులకు బుధవారం క్షయ వ్యాధి పై వైద్యసిబ్బంది అవగాహన కల్పించారు. యాంటీ టీబీ డే సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులనుంచి నమూనాలను సేకరించారు. హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఏఎన్‌ఎం, భాగ్యలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా పార్కింగ్

- అరకు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిత్యం ట్రాఫిక్ జామ్
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు, పాదచారులు
- పట్టించుకోని అధికారులు


ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలో ట్రాఫిక్ జామ్ అయిన దృశ్యం


ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ప్రైవేటు వాహనాలు

అరకులోయటౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రం అరకులోయలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఇష్టారాజ్యంగా వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో ప్రయాణికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పర్యాటకుల వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తుండడంతో రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. ముఖ్యంగా ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఈ సమస్య ఎక్కువగా ఉంది. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో జీపులు, కారులు, ప్రైవేట్ బస్సులను నిలిపివేస్తుండడంతో ఆర్టీసీ బస్సుల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. బస్సులు ఎలా ఎక్కాలో తెలియక ప్రయాణికులు తికమక పడుతున్నారు. ఇక్కడ నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. పార్కింగ్ సదుపాయం లేక వాహనాలను రోడ్లపైనే పెట్టుకోవాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పర్యాటకుల వాహనాలను పెద్ద ఎత్తున నిలిపివేయడంతో ఆర్టీసీ ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చాలా సేపు ట్రాఫిక్ జామ్ అవడంతో ప్రయాణికులు, వాహనచోదకులు ఇక్కట్లకు గురయ్యారు. ఇక్కడ ప్రైవేటు వాహనాలను నిలిపివేస్తున్నప్పటికీ నిరోధించవలసిన ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడం విశేషం.

కాఫీ మ్యూజియానికి పార్కింగ్ స్థలం లేకపోవడం వల్లే...

ఆర్టీసీ కాంప్లెక్స్ పక్కన ఏర్పాటు చేసిన కాఫీ మ్యూజియానికి పార్కింగ్ స్థలం లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని స్థానికులు తెలిపారు. కేక్‌లు, చాక్లెట్లు కొనుగోలు చేసేందుకు కాఫీ మ్యూజియానికి అధిక సంఖ్యలో పర్యాటకులు కార్లు, ఇతర వాహనాల్లో వస్తుంటారు. అయితే కాఫీ మ్యూజియం వద్ద నిర్వాహకులు పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేయకపోవడంతో అక్కడికి వచ్చేవారు అరకులోయ ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణతోపాటు కాంప్లెక్స్ రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్ ఇన్ అండ్ అవుట్ గేట్‌ల వద్ద తమ వాహనాలను నిలిపివేస్తున్నారు. దీంతో ఇక్కడ తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఇప్పటికైన ఆర్టీసీ అధికారులు ఇక్కడ వాహనాలు నిలపకుండా పర్యవేక్షించడంతో పాటు, ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని స్థానికులతో పాటు పర్యాటకులు కోరుతున్నారు.

మళ్లీ జోరుగా వర్షాలు


అరకులోయలో గొడుగుతో వెళుతున్న పర్యాటకులు


బెంజిపూర్ సమీపంలో పొగమంచు


యంత్రంతో వరిని నూరుస్తున్న రైతులు



చాపరాయి ముఖద్వారం వద్ద గొడుగులతో పర్యాటకులు

అరకులోయటౌన్: జిల్లాలో మళ్లీ వర్షాలు కురుస్తున్నాయి. ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలో సోమవారం రాత్రి నుంచి వర్షం కురుస్తోంది. ఏకధాటిగా కురుస్తున్న వర్షంతోపాటు చలిగాలులు వీస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఇటీవల వారం రోజుల పాటు వర్షాలు కురిశాయి. రెండు రోజులు తెరిపివ్వడంతో ఊపిరి పీల్చుకున్న రైతులు వరి కోతలు, నూర్పులకు సిద్ధమయ్యారు. అయితే మళ్లీ వర్షాలు పడుతుండడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పంటను ఎలా కాపాడుకోవాలో తెలియక అవస్థలు పడుతున్నారు. వర్షం కారణంగా అరకులోయ పట్టణంతోపాటు గిరి గ్రామాల్లో క్రిస్మస్ సందడి కానరాలేదు.

కొయ్యూరు: మండలంలో మంగళవారం ఉదయం నుంచి మోస్తారుగా వర్షం కురుస్తోంది. భారీగా వర్షాలు కురిస్తే ధాన్యం పాడవుతుందని భావించిన రైతులు యంత్రాలతో నూర్పులు చేపట్టారు.కోతలు కోసిన తరువాత ఒకటి రెండు రోజులు ఆరబెట్టి నూర్పులు చేస్తున్నారు. అన్ని ప్రాంతాల్లో జోరుగా వరి నూర్పులు జరుపుతున్నారు.

డుంబ్రిగుడ: మండలంలోని సోమ, మంగళవారాలలో జోరుగా వర్షాలు కురిశాయి. పర్యాటక కేంద్ర చాపరాయిని సందర్శించేందుకు వచ్చిన పర్యాటకులు వర్షం కారణంగా ఇబ్బందులకు గురయ్యారు. గొడుగులను ఆశ్రయించి, జలపాతాన్ని తిలకించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి


రైతులకు సూచనలు ఇస్తున్న మండల వ్యవసాయాధికారి మధుసూదనరావు


రైతుకు సూచనలు ఇస్తున్న ఏవో చక్రధర్

గూడెంకొత్తవీధి: విడవకుండా కురుస్తున్న వర్షాలు, తుపాన్ల నేపథ్యంలో గిరిజన రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి మధుసూధనరావు తెలిపారు. పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన పలు గ్రామాల్లోని రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద రాజ్‌మాకు పంటకు బీమా సదుపాయం కల్పిస్తోందన్నారు. ఈ నెల 31లోగా రైతులు తమ పంటల వివరాలను నమోదు చేసుకుని బీమా ప్రీమియంను చెల్లించాలని ఆయన చెప్పారు.వీఏఏలు పవన్, శ్రీదేవి, వెటర్నరీ సహాయకులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: వర్షాలు కురుస్తుండడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక వ్యవసాయాధికారి చక్రధర్ సూచించారు. ఆయన మంగళవారం రాజవొమ్మంగి మండలంలోని పలు రైతు క్షేత్రాలకు వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. పంట రక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మండలంలో ఇప్పటి వరకు మండలంలో 2,345 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు ఏవో చెప్పారు. ఆరబెట్టిన ధాన్యం ఉంటే వెంటనే దగ్గరలోని రైతు సేవా కేంద్రంలో సంప్రదిస్తే తేమ శాతం పరీక్షించి, గోనె సంచులు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఆయన వెంట సొసైటీ సీఈవో గోపాలకృష్ణ, వీఏవో రామరాజు, ప్రదీప్ తదితరులున్నారు.

పీసా చట్టంతో గిరిజనులకు రక్షణ

జిల్లా పంచాయతీ అధికారి లావరాజు


మినుములూరు పీసా గ్రామ సభలో మాట్లాడుతున్న లావరాజు


సంకాడలో పీసా దినోత్సవంలో ప్రతిజ్ఞ చేస్తున్న వైస్ ఎంపీపీ దేముడు, సర్పంచ్ నాగులమ్మ


కొంతి గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ రేగం రమేష్


ఎటపాక సభలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు


పెదలువ్వాసింగిలో మాట్లాడుతున్న ఎంపీటీసీ సన్యాసిదొర


తోటపుట్టు గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు రమేష్

పాడేరు రూరల్: గిరిజనుల హక్కులకు పీసా చట్టం రక్షణగా ఉంటుందని జిల్లా పంచాయతీ అధికారి లావరాజు తెలిపారు. మండలంలో 26 గ్రామ పంచాయతీల్లో మంగళవారం పీసా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మినుములూరు సచివాలయంలో నిర్వహించిన పీసా గ్రామ సభలో లావరాజు మాట్లాడుతూ పీసా కమిటీల ఏర్పాటుతో గిరిజనులకు రక్షణ లభిస్తుందన్నారు.

గూడెంకొత్తవీధి: పీసా చట్టం ద్వారా గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక అభివృద్ధికి అవకాశం ఉందని వైస్ ఎంపీపీ దేముడు తెలిపారు. సంకాడలో మంగళవారం నిర్వహించిన పీసా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. పీసా చట్టంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ నాగులమ్మ తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని 33 పంచాయతీల్లో పీసా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొంతిలో నిర్వహించిన గ్రామసభలో సర్పంచ్ రేగం రమేష్ మాట్లాడుతూ పీసా చట్టం గురించి వివరించారు.

ఎటపాక: పీసా గ్రామ సభల ద్వారా ఎన్నికైన ప్రతి నాయకుడు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బంగారు వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం ఎటపాకలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. నూతనంగా ఏర్పాటైన పీసా కమిటీలకు అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో దుర్గారెడ్డి, వినోద్, నాగేశ్వరావు,నర్సింహరావు, లక్ష్మణ్ తదితరులున్నారు.

జి.మాడుగుల: పీసా చట్టం గిరిజనుల హక్కులకు రక్షణగా ఉంటుందని, ఆదివాసీల పాలిట వరమని ఎంపీటీసీ సభ్యుడు గబ్బాడి సన్యాసిదొర తెలిపారు. మండలంలో పెదలువ్వాసింగిలో మంగళవారం సర్పంచ్ కె.సుబ్బలక్ష్మి అధ్యక్షతన పీసా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక గ్రామసభలో ఆయన మాట్లాడారు. పీసా చట్టంపై అందరూ అవగాహన ఏర్పర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు కె. సత్యనారాయణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: పీసా చట్టం గిరిజనుల హక్కులకు రక్షణగా ఉంటుందని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వి.రమేష్ అన్నారు.మండలంలోని సుజనకోట పంచాయితీ తోటపుట్టు గ్రామంలో మంగళవారం పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో పీసా గ్రామ సభను నిర్వహించారు.పీసా చట్టం వల్ల గిరిజనులకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడారు. ఏనుగురాయి,లక్ష్మీపురం,జోలాపుట్టు పంచాయతీ కేంద్రాలలో సహితం పీసా గ్రామ సభలను సర్పంచులు నరసింగరావు,త్రినాథ్,నీలకంఠం ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు సుబ్బలక్ష్మి ,కమల తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యల పరిష్కారం


దూసరపాములో అర్జీలు సమర్పిస్తున్న రైతులు


అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ నర్సమ్మ


రెవెన్యూ సదస్సులో పాల్గొన్న సర్పంచ్ సుభద్ర, డీటీ సీతారాం

గూడెంకొత్తవీధి: రెవెన్యూసదస్సుల ద్వారా భూ వివాదాలను పరిష్కరించుకోవాలని జీకే వీధి సర్పంచ్‌కొర్రా సుభద్ర అన్నారు. జీకే వీధిలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. డీటీ సీతారాం పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈవోపీఆర్డీ పాపారావు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని దూసరపాము, శరభవరం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి 30 అర్జీలు స్వీకరించినట్టు ఆర్‌ఐ చెల్లమ్మ తెలిపారు. దూసరపాములో మ్యుటేషన్ల కోసం 14 అర్జీలు, ఈ పాస్ బుక్ కోసం మూడు, ఎఫ్ లైన్ కోసం ఒక దరఖాస్తు వచ్చాయని చెప్పారు. శరభవరంలో మ్యుటేషన్ల కోసం 8, ఈ పాస్ బుక్స్ కోసం ఒకటి, ఎఫ్ లైన్ సర్వే కోసం ఒక అర్జీ వచ్చినట్టు తెలిపారు. గ్రామ రెవెన్యూ అధికారి అన్నిక శ్రీనివాస్, సర్పంచ్ చీడి శివ, సర్వేయర్లు రాంబాబు, అప్పన్నరెడ్డి పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవాలని తహసీల్దార్ నర్సమ్మ అన్నారు. మండలంలోని కించాయిపుట్టులో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 31 అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రవికుమార్,వీఆర్‌వో రమేష్ పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం


పాడేరులో ర్యాలీ నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు



అరకులోయలో మాట్లాడుతున్న ప్రిన్స్‌పాల్ చలపతిరావు

పాడేరు రూరల్: వినియోగదారుల హక్కులు, చట్టాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని స్థానిక డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎన్.రసూల్ తెలిపారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని డిగ్రీ కళాశాలలో మంగళవారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శంకర్‌రావు,కోటేశ్వరరావు, జీవనజ్యోతి, హిమబిందు,లావణ్య పాల్గొన్నారు.

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ (ఎఫ్ఏసీ) పట్నాసి చలపతిరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వినియోగదారుల హక్కుల రక్షణ చట్టం గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బాలరాజు, లక్ష్మి, ధర్మారావు, సంధ్యా, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరపాలి


మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రాజశేఖర్

చింతపల్లి: కొయ్యూరులో గురుకుల విద్యార్థి మృతిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కె.రాజశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. గురుకుల పాఠశాలలో గడిచిన రెండు వారాలుగా విద్యార్థి ఆచూకీ తెలియక పోయినా కనీసం పట్టించుకోలేదని, పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థి మృతి చెందాడని ఆరోపించారు.ఏజెన్సీ వ్యాప్తంగా గురుకులాలు, ఆశ్రమాల్లో అధికారుల పర్యవేక్షణ లోపం ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగానే ఎంతో మంది విద్యార్థులు మృత్యువాత పడుతున్నారని ఆరోపించారు. విద్యార్థుల మరణాలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి తనీష్,త్రినాథ్‌మూర్తి,ధారబాబు పాల్గొన్నారు.

హోంమంత్రి అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలి

బీఎస్పీ,కాంగ్రెస్ నేతల డిమాండ్


పాడేరులో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు,బీఎస్పీ నాయకులు



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సతక బుల్లిబాబు

సాక్షి,పాడేరు: భారత రాజ్యాంగ నిర్మాత,బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌పై పార్లమెంట్ సాక్షిగా అనుచిత వ్యాఖ్యలు చేసిన భారత హోంమంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించి, తగిన చర్యలు తీసుకోవాలని బీఎస్పీ, కాంగ్రెస్ నేతలు వేర్వేరుగా డిమాండ్ చేశారు. బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు ఇతర నాయకులు పాడేరు వీధుల్లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. పాతబస్టాండ్‌లోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్ చేస్తూ కలెక్టర్ దినేష్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సుర్ల అప్పారావు,జిల్లా నాయకలు భీమ్,మాధవరావు,చిన్నయ్య,పండన్న తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హోంమంత్రి అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి తొలగించి,చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సతక బుల్లిబాబు డిమాండ్ చేశారు. పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వంతాల కృష్ణారావు, రంజీత్‌కుమార్,నవీన్,సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాయకులు వెళ్లినా.. కార్యకర్తలు మా వెంటే


రేగ బోయిన స్వామి

అనంతగిరి(అరకులోయటౌన్): నాయకులు పార్టీ వీడినా కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ వెంటే ఉంటారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రేగ బోయిన స్వామి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భీంపోల్ సర్పంచ్ జన్ని బిమలమ్మ టీడీపీలో చేరడం వల్ల వైఎస్సార్ సీపీకి ఎటువంటి నష్టం ఉండదన్నారు. ఇటీవల కొత్తూరు పంచాయతీ సర్పంచ్ సారా సీతయ్య టీడీపీలో చేరారని అటువంటి వారికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.

వలంటీర్లను దగా చేసిన కూటమి నేతలు


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ మండల కార్యదర్శి శంకర్‌రావు

ముంచంగిపుట్టు: కూటమి నేతలు వలంటీర్లను దగా చేశారని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు విస్మరించారని సీఐటీయూ మండల కార్యదర్శి కె.శంకర్‌రావు తెలిపారు. మండల కేంద్రం ముంచంగిపుట్టులో మంగళవారం వలంటీర్లు,సీఐటీయూ నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వలంటీర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26వ తేదీ నుంచి మూడు రోజుల పాటు సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్టు చెప్పారు. వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని,బకాయి పడిన వేతనాలు చెల్లించాలని, రూ.10వేల వేతనం హామీని నెరవేర్చాలని,రాజీనామా చేసిన వలంటీర్లను సైతం విధుల్లోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.అనంతరం దీక్షలకు అనుమతి ఇవ్వాలని కోరుతూ స్థానిక పోలీసు స్టేషన్‌లో దరఖాస్తు అందజేశారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు దేవ, చిన్నయ్య, నరసింహమూర్తి, మధు,అర్జున్,హనుమంతరావు,కిరణ్, రాంబాబు,భానుమూర్తి, శ్యాంసుందర్,సుబ్బారావు పాల్గొన్నారు.